# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 302 శనివారం 22 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# రైతులకు రుణవిముక్తి!

- రుణమాఫీ, రైతు భరోసాపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
- రాహుల్ గాంధీ రుణమాఫీపై మాట ఇచ్చారని గుర్తు చేసిన ముఖ్యమంత్రి
- కటాఫ్ తేదీ డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023గా నిర్ణయించినట్లు వెల్లడి
- రైతుభరోసా విధివిధానాలకు మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసినట్లు చెప్పిన సీఎం
- కోతలయ్యాకే రైతుభరోసా
- సెప్టెంబర్ దాకా పెట్టుబడిసాయం లేనట్టే.. అమలుకు చర్చల మెలిక
- జూలైలో కమిటీ నివేదిక.. ఆ తర్వాత అసెంబ్లీకి.. 2 నెలలు పట్టే చాన్స్

హైదరాబాద్

రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని తమ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ మాట ఇచ్చారని... ఆ ప్రకారం రుణమాఫీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఏకకాలంలో మాఫీ చేస్తామన్నారు. శుక్రవారం కేబినెట్ భేటీ అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణ ఇస్తానన్న సోనియాగాంధీ మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. మే 6, 2022లో వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.28 వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 వరకు కటాఫ్ తేదీగా నిర్ణయించి రుణమాఫీ చేయనున్నట్లు చెప్పారు. రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయన్నారు. ఈ మధ్య కాలంలో - మిగతా3లో




# డీఎస్సీకి భారీగా దరఖాస్తులు

- జూన్20 సాయంత్రం నాటికి 3,02,798 మంది అభ్యర్థుల దరఖాస్తులు
- ఇప్పటివరకు 64,556 మంది అభ్యర్థులు తమ దరఖాస్తుల సవరణ
- టెట్ నిర్వహణ తప్పనిసరి అని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు టెట్ నోటిఫికేషన్ వెలువడటంతో దరఖాస్తు గడువును ఏప్రిల్ 2 నుంచి జూన్ 20 వరకు పొడగింపు

హైదరాబాద్

తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ- 2024' దరఖాస్తు ప్రక్రియ ముగిసింది జూన్20 సాయంత్రం నాటికి 3,02,798 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించగా.. ఇందులో 2.84 లక్షల మంది దరఖాస్తులు సమర్పించారు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజుగా రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కువ - మిగతా3లో



## తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు!

- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం
- వర్షాలు కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

హైదరాబాద్

తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో భారీ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలు కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని - మిగతా3లో

# కేసీఆర్‌కు చెమటలు!

- బీఆర్ఎస్ నుంచి జారుకుంటున్న ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్పీకర్ పోచారం
- ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి
- వ్యవసాయం దండగ కాదని.. పండగ చేసే బాధ్యత తమది : సీఎం



హైదరాబాద్

భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు జారుకుంటున్నారు. వారు అధికార కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతుండటంతో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు చెమటలు పడుతున్నాయి. ఆ రాష్ట్ర మాజీ స్పీకర్, బీఆర్ఎస్ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..రైతుల సంక్షేమానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నో సేవలందించారని రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. ఈ విషయంలో పోచారం సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. వ్యవసాయం దండగ కాదని.. - మిగతా3లో




## ఆ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ షురూ..!

- హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ముకశ్మీర్‌ల్లో ఓటర్ల జాబితా సవరణ
- వచ్చేనెల ఒకటో తేదీ లోగా ఓటర్ల జాబితాల సవరణకు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన
- ఎన్నికలకు తుది ఓటర్ల జాబితాను ఆగస్టు 20న ప్రచురిస్తామని వెల్లడి



## జేపీ నడ్డాకు కీలక బాధ్యతలు!

- రాజ్యసభలో ఆ పార్టీ నేతగా కొనసాగే అవకాశాలు
- మరికొద్ది మాసాల్లో జరగనున్న నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు
- ఆ ఎన్నికల క్రతువు పూర్తయ్యే వరకు పార్టీ అధినేతగా కొనసాగాలంటూ పార్టీలోని అగ్రనాయకత్వం జేపీ నడ్డాకు సూచించినట్లు సమాచారం
- తాజాగా మోదీ కేబినెట్‌లో ఆయన ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు

# కాంగ్రెస్, బీజేపీలను చరిత్ర ఎప్పటికీ క్షమించదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సింగరేణి గొంతు కోస్తున్న వేళ.. డిప్యూటీ సీఎం భట్టికి బాధ లేదు..
- వాళ్లకు తెలంగాణ ప్రజలపై ప్రేమ లేదు.. సింగరేణి కార్మికులపై అభిమానం లేదు..
- తెలంగాణ ప్రజల అటెన్షన్ డైవర్షన్ చేసేందుకేనా..
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికెళ్లి ఈ ఫిరాయింపులు

హైదరాబాద్

తెలంగాణ నేలపై.. సింగరేణి గొంతు కోస్తున్న వేళ.. డిప్యూటీ సీఎం భట్టికి బాధ లేదు.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రంది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లకు తెలంగాణ ప్రజలపై ప్రేమ లేదని.. సింగరేణి కార్మికులపై అభిమానం లేదని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మండిపడ్డారు. ఆ ఇద్దరికీ పట్టలేనంత సంతోషం.. మాటల్లో చెప్పలేనంత ఆనందం.. చిరునవ్వులు చిందిస్తున్న ఈ చిత్రమే.. వీరి కుమ్మక్కు కుట్రలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొంటూ ఒక ఫొటోను ట్వీట్ చేశారు.

వేలాది మంది కార్మికుల పొట్టగొట్టి.. వందేళ్ల సంస్థ భవిష్యత్తును చీకట్లోకి నెట్టి.. పూలబొకేలతో నిస్సిగ్గుగా ఫోటోలకు ఫోజులిస్తున్నారా? అని భట్టి విక్రమార్క, కిషన్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. సిరుల గనికి మరణశాసనం రాస్తూ చిద్విలాసమా ?? వేలాది మంది కార్మికుల జీవితాలతో చెలగాటమా ??? అని ప్రశ్నించారు. ఈ "వేలం" వెర్రి నిర్ణయాల నుంచి.. తెలంగాణ ప్రజల అటెన్షన్ డైవర్షన్ చేసేందుకేనా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికెళ్లి ఈ ఫిరాయింపులు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలైనా గ్యారెంటీలు అమలు - మిగతా3లో



# ఆ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ షురూ..!




త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న హర్యానా, మహారాష్ట్ర, జార?ండ్, జమ్ముకశ్మీర్‌ల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చేనెల ఒకటో తేదీ లోగా ఓటర్ల జాబితాల సవరణకు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. హర్యానా, మహారాష్ట్ర, జార?ండ్ రాష్ట్రాలతోపాటు జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగే ఎన్నికలకు తుది ఓటర్ల జాబితాను ఆగస్టు 20న ప్రచురిస్తామని తెలిపింది. శ్రీనగర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ త్వరలో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించిన మరునాడే కేంద్ర ఎన్నికల సంఘం ప్రక్రియ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జమ్ముకశ్మీర్ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారని ఈసీ తెలిపింది. జమ్ముకశ్మీర్ లో సార్వత్రిక ఎన్నికల్లో 58 శాతం ఓటింగ్ నమోదైంది. 2018లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీని రద్దు చేశారు. ప్రస్తుత హర్యానా అసెంబ్లీ గడువు నవంబర్ మూడో తేదీ, మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26, జార?ండ్ అసెంబ్లీ గడువు 2025 జనవరితో ముగియనున్నది. ఇదిలా ఉంటే సెప్టెంబర్ 30 లోపు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదనుగుణంగా జమ్ముకశ్మీర్ అసెంబ్లీ పునర్విభజన ద్వారా అసెంబ్లీ స్థానాలను 83 నుంచి 90కి పెంచారు.ఖ

## జేపీ నడ్డాకు కీలక బాధ్యతలు..!



**న్యూఢిల్లీ :** బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో ఆ పార్టీ నేతగా కొనసాగే అవకాశాలున్నాయని తెలుస్తోంది. జేపీ నడ్డా బీజేపీ అధ్యక్ష పదవి ఈ నెలతో ముగియనుంది. అయితే మరికొద్ది మాసాల్లో నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల క్రతువు పూర్తయ్యే వరకు పార్టీ అధినేతగా కొనసాగాలంటూ పార్టీలోని అగ్రనాయకత్వం జేపీ నడ్డాకు సూచించినట్లు సమాచారం. అనంతరం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మరొకరికి నియమించే అవకాశముంది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ నుంచి జేపీ నడ్డా రాజ్యసభకు ఎన్నికైన సంగతి తెలిసిందే. తాజాగా మోదీ కేబినెట్‌లో ఆయన ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మోదీ తొలి కేబినెట్‌లో సైతం ఆయన ఇదే శాఖను నిర్వహించారు. ఇక 2020లో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు జేపీ నడ్డాకు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం విధితమే.

## సుస్థిరతకే ఓటు.. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాతీర్పు ఇదేనన్న మోదీ

**శ్రీనగర్:** 'సుస్థిరత'కే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు పెద్దపీట వేశారని, సుస్థిరతను కోరుకుంటున్నామనే సందేశాన్ని ఎన్నికలు ఫలితాలు చాటిచెప్పాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడాన్ని ప్రస్తావిస్తూ, సుస్థిర ప్రభుత్వమనే కొత్త శకంలోకి దేశం అడుగుపెట్టిం దన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో రెండ్రోజుల పర్యటనలో ఉన్న ప్రధాని శుక్రవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రజల అంచనాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం ఫలితాలు చూపెట్టిందని, పనితీరు ఆధారంగానే ప్రజలు 60 ఏళ్ల తర్వాత వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. తమకంటే ముందు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను ప్రస్తావిస్తూ, గత శతాబ్దంలోని చివరి దశాబ్దంలో అస్థిర ప్రభుత్వాలను చూశామనీ, పదేళ్లలో ఐదుసార్లు ఎన్నికలు జరిగాయని అన్నారు. ఎన్నికలకే దేశం పరిమితమైందే కానీ ఎలాంటి ప్రగతి సాధించలేకపోయిందన్నారు. ఇలాంటి అస్థిరత, అనిశ్చితి సమయంలో ఇండియాను ముందుకు తీసుకువెళ్లేందుకు తాము పగ్గాలు చేపట్టామని, పలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నామని చెప్పారు. ఇదంతా గతమని, ఇప్పుడు ఇండియా సుస్థిర ప్రభుత్వ శకంలోకి అడుగుపెట్టిందని, ప్రజాస్వామ్యం మరింత పటిష్టమైందని అన్నారు. ప్రజాస్వామ్య పటిష్టతలో జమ్మూకశ్మీర్ పాత్ర కీలకమని చెప్పారు. మానవత్వం, ప్రజాస్వామ్యం, కశ్మీరియత్ కోసం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి కన్నకలలు సాకారం కానున్నాయని అన్నారు.

**త్వరలోనే జమ్మూకశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం**

జమ్మూకశ్మీర్‌కు త్వరలోనే తిరిగి రాష్ట్ర హోదా కలిగించున్నామనే సంకేతాలిస్తూ, అసెంబ్లీ ఎన్నికల ద్వారా కశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడే సమయం ఎంతో దూరంలో లేదని ప్రధాన మంత్రి అన్నారు. ఈ ఎన్నికలతో జమ్మూకశ్మీర్ ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం, తద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవడం జరుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలు సైతం జరుగుతున్నాయని చెప్పారు. రూ.1,500 కోట్ల విలువచేసే 84 ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టులను గురువారం ప్రారంభించనున్నట్టు కూడా ప్రధాని ఈ సందర్భంగా ప్రకటించారు. రూ.1,800 కోట్లతో వ్యవసాయరంగానికి చెందిన ప్రాజెక్టులను ప్రారంభిం చనున్నామని, కొత్త జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మించనున్నామని చెప్పారు. గత పదేళ్లలో కశ్మీర్ స్టార్టప్‌లు, స్కిల్ డవలప్‌మెంట్, క్రీడల్లో ముందుకు దూసుకెళ్లోందని, పాలిటెక్నిక్ సీట్లు పెరిగాయని, న్యూ స్కిల్స్‌కు అవకాశాలు

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రత డొల్ల..
# థర్డ్ పార్టీ సమీక్షలో నిగ్గు తేలిన నిజం!





నీట్ యూజీ 2024 పరీక్షలో అవకతవకలు జరిగాయని, ప్రశ్నాపత్రం లీకైందని విద్యార్థులు, విపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో మరో సంగతి బయట పడింది. ఎంబీబీఎస్ సహా పలు వైద్య కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే 'నీట్ యూజీ' పరీక్షకు పటిష్ట భద్రత ఉంటుంది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సునిశిత తనిఖీలు ఉంటాయి. సీసీటీవీ కెమెరా నిఘా కూడా ఉంటుంది. కానీ గత నెల ఐదో తేదీన జరిగిన నీట్ యూజీ 2024 పరీక్షలో నిబంధనలు పాటించలేదని తెలుస్తున్నది. నీట్ నిర్వాహక సంస్థ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన థర్డ్ పార్టీ సమీక్షలో ఈ సంగతి వెల్లడైంది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద రెండు సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రశ్నాపత్రాలు నిల్వ ఉంచిన కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డులు ఉండాలి. కానీ ఈ సారి నీట్ పరీక్ష నిర్వహణలో ఈ నిబంధనలకు నీళ్లు వదిలారని తెలుస్తున్నది. పలు కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ప్రశ్నా పత్రాల నిల్వ కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డుల భద్రత లేదు. దేశవ్యాప్తంగా 4000 పరీక్షా కేంద్రాలకు గాను 399 పరీక్షా కేంద్రాలను థర్డ్ పార్టీ పర్యవేక్షకులు పరిశీలించారు. కానీ 399 పరీక్షా కేంద్రాల్లో 186 కేంద్రాల్లో ప్రతి పరీక్షా రూమ్ వద్ద రెండు సీసీటీవీ కెమెరాలూ లేనే లేవు. ఈ సీసీటీవీ కెమెరాలను కేంద్రంలోని ఎన్టీఏ కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేస్తారు. 399 పరీక్షా కేంద్రాల్లో 68 చోట్ల స్ట్రాంగ్ రూమ్ ల వద్ద గార్డుల భద్రతే లేదు. విద్యార్థులకు పరీక్షా పత్రాలు పంపిణీ చేసే వరకూ ఈ గార్డుల భద్రత తప్పనిసరి. మరో 83 పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల బయో మెట్రిక్ స్టాఫ్, పరీక్షా కేంద్రాల్లో నియమించిన స్టాఫ్ వేర్వేరుగా ఉన్నారని తేలింది. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల తనిఖీలు, అందుకు అవసరమైన జామర్లు ఏవీ కనిపించలేదని తేలింది. ఇదిలా ఉంటే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు బీహార్‌లో ప్రశ్నాపత్రం లీకైందని తేలింది. తమకు పరీక్షకు ముందు రోజు రాత్రి ప్రశ్నాపత్రం అందిందని బీహార్ రాష్ట్రంలో అరెస్టయిన విద్యార్థులు.. పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. ఈ పరీక్ష పత్రం లీక్ సూత్రధారి అయిన నిందితుడు ఒక్కో విద్యార్థి నుంచి రూ.32 లక్షల వరకూ వసూలు చేసినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## రెండు రోజుల పర్యటన కోసం
# భారత్ వచ్చిన బంగ్లా ప్రధాని



**న్యూఢిల్లీ, జూన్ 21:** బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం భారత్ చేరుకున్నారు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగ్లా ప్రధాని హసీనాకు కేంద్ర సహాయ మంత్రి కృతివర్ధన్ సింగ్ స్వాగతం పలికారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత్ పర్యటనతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. భారత్ పొరుగునున్న దేశాల్లో నమ్మకమైన కీలక భాగస్వామి దేశం బంగ్లాదేశ్ అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం కొత్తగా ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. దేశానికి వస్తున్న ద్వైపాక్షిక దేశం బంగ్లాదేశ్ అని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పర్యటనలో ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా భారత రాష్ట్రపతి దౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తోపాటు ప్రధాని నరేంద్ర మోదీతో బంగ్లా ప్రధాని హసీనా సమాశమవనున్నారు. మరోవైపు జూన్ 9వ తేదీ ప్రధాని మోదీతోపాటు ఆయన కేబినెట్ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. వారిలో బంగ్లా ప్రధాని షేక్ హసీనా కూడా ఉన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో బంగ్లా ప్రధాని షేక్ హసీనా భేటీ అయిన విషయం విధితమే.

## ఆ మూడు చట్టాల అమలును వాయిదా వేయండి..
## ప్రధాని మోదీకి మమతాబెనర్జి లేఖ



బీజేపీ సర్కారు అమల్లోకి తీసుకురాబోతున్న మూడు నూతన క్రిమినల్ చట్టాలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఆ మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని లేఖలో కోరారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలు ఈ జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే మమతాబెనర్జి ప్రధానికి లేఖ రాశారు. కొత్తగా రూపొందించిన క్రిమినల్ చట్టాలను వాయిదా వేయడంవల్ల వీటిపై పార్లమెంటులో సమీక్ష జరిపే అవకాశం ఉంటుందని మమతాబెనర్జి పేర్కొన్నారు. కాగా, బ్రిటిష్‌కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 చట్టాల స్థానంలో.. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా చట్టాలను బీజేపీ రూపొందించింది.

## భూకంపంతో దిశ మారిన గంగానది

**2500 ఏండ్ల క్రితం జరిగి ఉండొచ్చు**

**తాజా అధ్యయనంలో వెల్లడి**



**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే రెండో అతి పెద్ద నదిగా గుర్తింపు పొందిన గంగానదికి సంబంధించి ఓ అధ్యయనంలో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. గంగానదిపై వేర్వేరు దేశాల్లోని విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనం వివరాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 2500 ఏండ్ల క్రితం సంభవించిన ఒక భూకంపం వల్ల గంగానది ప్రవాహ దిశను మార్చుకున్నదని ఈ అధ్యయనంలో తేలింది. సాధారణంగా నదులు క్రమంగా దిశ మార్చుకునేందుకు వందల ఏండ్లు పడుతుంది. గంగానది లాంటి పెద్ద నది దిశ మార్చుకోవడం దాదాపు జరగదని పరిశోధకులు చెప్తున్నారు. అయితే, ఒక భారీ భూకంపం కారణంగా గంగానది ఒకేసారి దిశ మార్చుకుందని వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలను అధ్యయనం చేసిన పరిశోధకులు దాదాపు 100 కిలోమీటర్ల మేర గంగా నది పాత ప్రధాన ప్రవాహ ప్రాంతాన్ని గుర్తించారు. రిక్టర్ స్కేలుపై 7 %–% 8 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల ఈ మార్పు చోటు చేసుకొని ఉండొచ్చని పరిశోధకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## 'నీట్' పేపర్ లీక్ సూత్రధారి నితీష్ కుమార్...
## తేజస్వి స్ట్రాంగ్ కౌంటర్




**పాట్నా:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన 'నీట్' ప్రశ్నాపత్రం లీక్ కేసులో బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తొలిసారి పెదవి విప్పారు. ఈ కేసులో తనను ఇరికించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని తప్పుపట్టారు. పేపర్ లీక్ కేసులో అమిత్ ఆనంద్, నితీష్ కుమార్ ప్రధాన సూత్రధారులని సంచలన ఆరోపణలు చేశారు. కేసులో నిందితుడిగా తేలిన వ్యక్తితో తేజస్వి వ్యక్తిగత సహాయకుడికి పరిచయం ఉదంటూ బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా ఆరోపణలు చేసిన నేపథ్యంలో తేజస్వి కౌంటర్ అటాక్ ఇచ్చారు. ఈ కేసులో అసలైన సూత్రధారుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ప్రత్యారోపణ చేశారు.

**'నీట్'పై 'ఇండియా' కూటమిది ఒకేమాట**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో 'ఇండియా' కూటమి ఒకే మాట మీద ఉందని తేజస్వి చెప్పారు. "నీట్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని మేము కోరుతున్నాం. బీజేపీ దగ్గర అన్ని దర్యాప్తు సంస్థలు ఉన్నారు. దర్యాప్తు కోసం పీఎస్‌లు లేదా పీఏలను పిలిపించవచ్చు. అసలైన సూత్రధారుల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం వాళ్లు చేస్తున్నారు. నన్నో, నా పీఏనో ఇందులోకి లాగడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. పేపర్ లీకేజీ ప్రధాన సూత్రధారులు అమిత్ ఆనంద్, నితీష్ కుమార్‌లే. బీజేపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా పేపరు లీకేజీలు తప్పవనే విషయం దేశ ప్రజలందరికీ తెలుసు" అని తేజస్వి అన్నారు.

## హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మృతి



**న్యూఢిల్లీ:** హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మరణించినట్టు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఆ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ గతంలో కన్నా ఈ ఏడాది మృతుల సంఖ్య తగ్గిందని, గత ఏడాది 187 మంది మరణించినట్టు చెప్పారు. ఈ ఏడాది హజ్ యాత్రకు ఇప్పటివరకు 1,75,000 మంది వెళ్లారన్నారు. అయితే వీరిలో 98 మంది మరణించారని, ఇవన్నీ వృద్ధాప్య, దీర్ఘకాలిక రోగాల కారణంగానే సంభవించాయన్నారు.

## కేజ్రీవాల్ వ్యవహారంలో
## ఈడీ తీరుపై మండిపడ్డ సునీత



**న్యూఢిల్లీ :** ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వ్యవహరిస్తున్న తీరుపై ఆయన భార్య సునీత కేజ్రీవాల్ మండిపడ్డారు. అరవింద్ కేజ్రీవాల్.. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ అన్నట్లుగా ఈడీ వ్యవహారశైలి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని నియంత అన్ని హద్దులను అతిక్రమించారంటూ ప్రధాని మోదీపై సునీత కేజ్రీవాల్ పరోక్ష విమర్శలు చేశారు. దక్షిణ ఢిల్లీలోని బోగల్‌లో విలేకర్లతో సునీతమాట్లాడారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు నిన్న ట్రయిల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ రోజు ఉదయం ఆదేశాలు అందాయి. దీంతో కేజ్రీవాల్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ ఇన్ ఇండియాగా అయిపోయారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అరెస్ట్ చేసింది. ఆ క్రమంలో ఆయనకు గురువారం ట్రయిల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజురును రద్దు చేయాలంటూ ఈడీ.. ఢిల్లీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై వాదనలు విన్న ఢిల్లీ సుప్రీంకోర్టు.. తన నిర్ణయాన్ని మంగళవారం తెలియజేస్తానని తెలిపింది. ఈ నేపథ్యంలో ఈడీ వ్యవహారశైలిపై సునీత కేజ్రీవాల్ నిప్పులు చెరిగారు. మరోవైపు హర్యానా నుంచి ఢిల్లీకి మరిన్ని మంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆప్ మంత్రి అతిశీ దక్షిణ ఢిల్లీలోని బోగల్‌లో అమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆ క్రమంలో ఆ దీక్షా శిబిరాన్ని శుక్రవారం సునీత కేజ్రీవాల్ సందర్శించారు.

# కేసీఆర్‌కు చెమటలు!

-మొదటిపేజీ తరువాయి

పండగ చేసే బాధ్యత తమదని చెప్పారు. రైతు సంక్షేమ రాజ్యం కోసం సహకరించే అందరి మద్దతు తీసుకుని ముందుకెళ్తామన్నారు.

**రేవంత్‌రెడ్డి ధైర్యంగా ముందుకెళ్తున్నారు: పోచారం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నానని.. సీఎం రేవంత్‌ను మనస్ఫూర్తిగా ఇంటికి ఆహ్వానించానని పోచారం తెలిపారు. రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల ప్రగతికి తీసుకున్న నిర్ణయాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. తాను రైతుబిడ్డనని.. అందుకే ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు వివరించారు. "సమస్యలను అధిగమిస్తూ సీఎం రేవంత్ ధైర్యంగా ముందుకెళ్తున్నారు. నా జీవితంలో ఆశించేది రైతు సంక్షేమం తప్ప ఇంకేమీ లేదు. గతంలో వ్యవసాయ మంత్రిగా పనిచేశాను. అందరి సహకారంతో రాష్ట్ర భవిష్యత్ కోసం పనిచేస్తాం. నా రాజకీయ జీవితం ప్రారంభమైందే కాంగ్రెస్‌తో. ఆ తర్వాత తెదేపా, భారాసలో పనిచేశాను. రేవంత్ చేపడుతున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే కాంగ్రెస్‌లో చేరాను. 20 ఏళ్లు రాష్ట్రానికి నాయకత్వం వహించే ఓపిక ఆయనకు ఉంది. మాకు వయసైపోయింది.. పనిచేసే నాయకుడిని ప్రోత్సహించాలి" అని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

**ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్**

రాజకీయ విలువలుంటే, దమ్ముంటే కాంగ్రెస్‌లో చేరిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఆ పదవికి రాజీనామా చేయాలని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. పార్టీ మారేందుకు పోచారం చెప్తున్న కారణాలు చూస్తే దయ్యాలు



వేదాలు వల్లించినట్టే ఉన్నదని దుయ్యబట్టారు. పోచారం రాజీనామా చేస్తే తానే ఆయనపై పోటీ చేస్తానని ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, బీఆర్ఎస్ నేత అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి బాజిరెడ్డి శుక్రవారం మీడియా సమావేశం మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి చేస్తున్న మేలును దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు పోచారం చెప్పడం ఆత్మవంచనే అని, రైతులకు ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి తీరును పోచారం ఎందుకు మరచిపోయారోనని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బాన్సువాడ ప్రచారంలో పోచారం కుటుంబాన్ని రేవంత్ దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చారని, ఆయన నాయకత్వంలోనే పార్టీ మారడం నిజంగా ఆశ్చర్యంగా ఉందన్నారు. కేసీఆర్ పోచారానికి స్పీకర్, మంత్రి పదవులిచ్చి గౌరవించారని గుర్తుచేశారు. పోచారం పార్టీ మారడం వల్ల బీఆర్ఎస్‌కు నష్టమేమి లేదని, కాంగ్రెస్‌కు కూడా లాభం ఉండదని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక రేవంత్‌రెడ్డి రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని, ఆరు నెలల్లోనే రేవంత్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఓటుకు నోటు దొంగ రేవంత్ మళ్లీ అవే రాజకీయాలు మొదలు పెట్టారని, రేవంత్ ఆటలు ఇక సాగవని హెచ్చరించారు.

## కాంగ్రెస్, బీజేపీలను చరిత్ర ఎప్పటికీ క్షమించదు



-మొదటిపేజీ తరువాయి

చేయలేని.. అసమర్థత నుంచి తప్పించుకునేందుకేనా ఈ కుప్పిగంతులు అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఆగమైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నీతి లేని నిర్ణయాల్లో కాంగ్రెస్ కూడా భాగమైందన్నారు. మీ రెండు జాతీయ పార్టీలకు వేసిన ఓటు.. తెలంగాణ జాతి ప్రయోజనాలకే గొడ్డలి పెట్టు అని పేర్కొన్నారు. సంక్షేమానికి పాతరేసి.. అభివృద్ధిని పాతాళానికి తొక్కేసి.. ఇద్దరూ ఆడుతున్న వికృతక్రీడ ఇది అని మండిపడ్డారు. తొమ్మిదేళ్లు కంటికి రెప్పలా కాపాడిన.. తెలంగాణ సహజ సంపదను చెరబట్టినందుకు.. కాంగ్రెస్, బీజేపీలను చరిత్ర ఎప్పటికీ క్షమించదని అన్నారు.

**అప్పుడు సింగరేణి గనుల వేలం వద్దని..**

**ఇప్పుడు ఎందుకు మద్దతిచ్చారు.. రేవంత్‌రెడ్డిని నిలదీసిన కేటీఆర్**

సింగరేణి గనుల వేలం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎండగట్టారు. రేవంత్ రెడ్డి 2021లో పీసీసీ ప్రెసిడెంట్‌గా, ఎంపీగా ఉన్నప్పుడు బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని, 4 బొగ్గు బ్లాకులను సింగరేణి కాలరీస్‌కు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో పెద్ద ఎత్తున వ్యతిరేకించిన మీరు, కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు తెలంగాణ ప్రజలను పూర్తిగా నిరుత్సాహపరిచేలా వేలంలో పాల్గొనేందుకు ఉప ముఖ్యమంత్రిని ఎందుకు పంపించారని నిలదీశారు. ఈ మార్పునకు దారి తీసిన కారణాలను వివరించగలరా? అని ప్రశ్నించారు. తెలంగాణ బొగ్గు క్షేత్రాలను వేలం వేయడం ద్వారా పెట్టుబడుల ఉపసంహరణ ముసుగులో సింగరేణిని చివరకు ప్రైవేటీకరించేందుకు మార్గం సుగమం అవుతుందని మీరు అంగీకరించలేదా అని అడిగారు. ఎన్డీయే ప్రభుత్వం గుజరాత్, ఒడిశాలోని పీఎస్‌యూలను గనుల ప్రత్యక్ష కేటాయింపులపై మీ ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. తెలంగాణ పీఎస్‌యూకి అదే చికిత్స ఎందుకు ఇవ్వడం లేదన్నారు.

## కారు రూటు మారింది...

**బాబు ఇమేజ్ పెంచేస్తున్న గులాబీ దళం**

**హైదరాబాద్ :** తెలుగుదేశం పార్టీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేసిందని కేటీఆర్ మీడియా ముందు చెప్పారు. నిజానికి ఈ విషయాన్ని టీడీపీ కూడా చెప్పుకోవడం లేదు. నిజామా తాము ఇంత విజయం సాధించామా అని ఏపీలోని టీడీపీ క్యాడర్ కూడా ఆశ్చర్యపోయింది. నిజానికి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేశామని కేంద్రం అధికారికంగా ఎక్కడా ప్రకటించలేదు. కానీ కొత్తగా బాధ్యతలు చేపట్టిన గనుల మంత్రి కిషన్ రెడ్డి మాత్రం.. ఇప్పట్లో ప్రైవేటీకరణ ఉండబోదని ప్రకటన చేశారు. దీన్నే ప్రైవేటీకరణ నిలిపివేత ప్రకటనగా కేటీఆర్ భావించారు. ఇప్పుడు కేంద్రంలో టీడీపీ కూడా కీలకమైన భాగస్వామి కాబట్టి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అంగీకరించదు. ఈ విషయం తెలుసు కాబట్టి కేంద్రం వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గుతుంది. అందులో పెద్ద రాజకీయం లేదు. .అయినా కేటీఆర్ టీడీపీని పదే పదే పొగడటానికి దీన్నో కారణంగా తీసుకున్నారు. ఆయనే కాదు.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో కీలక నేత హరీష్ రావు కూడా టీడీపీ అధినేత చంద్రబాబును మై?క అందుకున్నప్పుడల్లా పొగుడుతున్నారు. అయితే రేవంత్ ను కార్నర్ చేయడానికి ఆయన చంద్రబాబు ప్రస్తావన తెస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అంటే బీఆర్ఎస్ అగ్రనేతలకు అంత అభిమానం లేదు. మొదటి నుంచి టీడీపీకి వ్యతిరేకంగానే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించి సమైక్యాంధ్రకు మద్దతు తెలిపినప్పటికీ రాష్ట్ర విభజన అనంతర రాజకీయాల కారణంగా వైసీపీ అధినేత జగన్‌తోనే సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ గురించి ఎప్పుడూ బీఆర్ఎస్ పెద్దలు పాజిటివ్ గా మాట్లాడలేదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ ఓడిపోతుందని చెబుతారు. 2014 ఎన్నికల సమయంలో కూడా కేసీఆర్ ఏపీలో టీడీపీ ఓడిపోతుందని జోస్యం చెప్పారు. 2019 ఎన్నికల నాటకి ఏపీలో వైసీపీ గెలవడానికి జగన్మోహన్ రెడ్డికి తెలంగాణలో అధికార పార్టీగా అన్ని రకాలుగా అండాగ నిలిచారు. ఇటీవలి ఎన్నికల్లో చాలా మీడియా ఇంటర్వ్యూల్లో ఏపీలో టీడీపీ ఓడిపోతుందని.. జగన్ రెండో సారి అధికారంలోకి వస్తారని తమకు సమాచారం ఉందని చెబుతూ వచ్చారు. కానీ ఇప్పుడు పూర్తిగా వారి అభిప్రాయాలను మార్చుకున్నారు. టీడీపీ గురించి పాజిటివ్‌గా మాట్లాడుతున్నారు.తెలంగాణకు ప్రాంతీయ పార్టీలే శ్రీరామరక్ష అని చెప్పాలనేది కేటీఆర్ వ్యూహం. ఎంత శ్రీరామరక్ష అనేదితెలంగాణ ప్రజలకు చెప్పాలంటే.. వారికి ఎదురుగా టీడీపీనే కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీని అక్కడి ప్రజుల గెలిపించడం వల్ల ఆ రాష్ట్రం ఎన్నో ప్రయోజనాలు పొందుతుందని చెప్పాలని కేటీఆర్ అనుకుంటున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్నందున పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందబోతోందని ఇటీవల ట్వీట్ చేశారు. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ టీడీపీ ఆపేసిందని క్రెడిట్ ఇచ్చేశారు. అదే బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఉంటే సింగరేణిని కాపా?కునేవారమని.. జాతీయ పార్టీలకు ఓటు వేయడం వల్ల.. గనులు కూడా వేలం లో పాడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఇది.. తెలంగాణకు అన్యాయం చేయడమేనని అంటున్నారు. అంటే.. కేటీఆర్ టీడీపీపై అభిమానంతో కాకుండా.. తన పార్టీని రివైవ్ చేసుకోవడానికి ..తన పార్టీ వైపు ఓటర్లు మళ్లడానికి.. టీడీపీని ఓ ఆయుధంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని సులువుగా అర్థం చేసుకోవచ్చు. మరో వైపు హరీష్ రావు కూడా చంద్రబాబును, టీడీపీ ప్రభుత్వాన్ని పొగుడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు చేస్తున్నారని అంటున్నారు. దీనికి కారణం రేవంత్ అమలు చేయలేకపోతున్నారని ఆయనకు చేత కావడం లేదని విమర్శలు చేయడానికే. రేవంత్ రెడ్డి పనితీరును తక్కువ చేయడానికి చంద్రబాబును హరీష్ రావు ఉపయోగించుకుంటున్నారు. నిజానికి ఎవరి పని తీరు వారిది. రేపు ఏపీలో టీడీపీ నేతలు రేవంత్ పనితీరును చూపించి చంద్రబాబును విమర్శించవచ్చు. బీఆర్ఎస్ నేతలు తెలుగుదేసం పార్టీ జపం చేయడం రాజకీయ వర్గాలకు ఆశ్చర్యకరమే. ఎందుకంటే గతంలో కూడా బీఆర్ఎస్ నేతలు టీడీపీ పేరును తరచూ ఉపయోగించేవారు.కానీ అది నెగెటివ్ కోణంలోనే. ఆ పార్టీ తెలంగాణకు ప్రమాదమని చెప్పేందుకు ఉపయోగించేవారు. తెలంగాణ వ్యతిరేక పార్టీ..ఆంధ్రా పార్టీగా ముద్ర వేసి.. మన దగ్గర ఉనికి ఉండకూడదని ఓటర్లకు చెప్పేవారు. కానీ ఇరప్పుడు రివర్స్ లో టీడీపీ ఏపీలో గొప్పగా చేస్తోందని.. ఇక్కడ కూడా .. ఏపీ ప్రజలు టీడీపీని ఆదరించినట్లుగా.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ను ఆదరించాలని కోరుకుంటున్నారు. అదే చెబుతున్నారు. వీరి ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయో కానీ.. టీడీపీ మరో సారి తెలంగాణలో చర్చనీయాంశం అవుతోంది.

## తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు..!

-మొదటిపేజీ తరువాయి

వాతావరణ శాఖ పేర్కొంది. ఆదివారం నాడు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# డీఎస్సీకి భారీగా దరఖాస్తులు

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలనుకునేవారు, ప్రతి ఉద్యోగం కోసం రూ.1000 అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 'అప్లికేషన్ ఎడిట్' ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు 64,556 మంది అభ్యర్థులు తమ దరఖాస్తులు సవరించుకున్నారు. టెట్ ఫలితాలు విడుదలకావడంతో.. అభ్యర్థులు తమ టెట్ మార్కుల వివరాలు నమోదుచేసుకోవడం, ఇతర వివరాలు మార్చుకోవడానికి అవకాశం కల్పించారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే 91541 14982, 63099 98812 నంబర్లతోపాటు, ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. తెలంగాణలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 29న 'మెగా డీఎస్సీ-2024' నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థుల నుంచి మార్చి 4 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఏప్రిల్ 2తో దరఖాస్తు గడువు ముగియాల్సి ఉండగా.. టెట్ నిర్వహణ తప్పనిసరి అని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు టెట్ నోటిఫికేషన్ వెలువడటంతో దరఖాస్తు గడువును ఏప్రిల్ 2 నుంచి జూన్ 20 వరకు పొడిగించారు. టెట్ ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. గత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన వాళ్లు ఆయా పోస్టులకు మళ్లీ కొత్తగా దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదు. గరిష్ఠ వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచిన సంగతి తెలిసిందే.




**తెలంగాణ డీఎస్సీ - 2024**

**ఖాళీల సంఖ్య: 11,062.**

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ): 6,508 పోస్టులు

స్కూల్ అసిస్టెంట్: 2,629 పోస్టులు

లాంగ్వేజ్ పండిట్: 727 పోస్టులు

పీఈటీ (వ్యాయామ ఉపాధ్యాయులు): 182 పోస్టులు

స్పెషల్ ఎడ్యుకేషన్ (స్కూల్ అసిస్టెంట్): 220 పోస్టులు

స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్జీటీ) 796 పోస్టులు

**అర్హతలు..**

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు కేవలం డీఎడ్ పూర్తిచేసినవారు మాత్రమే అర్హులు. బీఈడీ అర్హత ఉన్నవారు పోటీపడటానికి అవకాశంలేదు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు (ఎస్ఏ) పోస్టులకు సంబంధిత బీఈడీ (మెథడాలజీ) పూర్తిచేసినవారు అర్హులు. నాలుగేళ్ల బీఈడీ పూర్తిచేసినవారు సైతం పోటీపడటానికి అవకాశముంది.

ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలి. దీంతోపాటు, యూజీ డీపీఈడీ కోర్సు పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ పూర్తిచేసినవారు.. బీపీఈడీ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.

బీఎడ్, డీఎడ్ చివరి సంవత్సరం/చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు.

తెలంగాణ, ఏపీ టెట్, లేదా సెంట్రల్ టెట్ (సీ టెట్)లో క్వాలిఫై అయి ఉండాలి.

గతంలో ఏజెన్సీ పోస్టుల్లో 100 శాతం గిరిజనులకే కేటాయించగా, ఈ నిబంధనను తాజాగా ఎత్తివేశారు. అంతా పోటీపడొచ్చు.

ఎస్టీ రిజర్వేషన్ గతంలో 6 శాతం ఉండగా, పెంచిన 10 శాతాన్నే వర్తింపజేస్తారు.

గతంలో లోకల్, ఓపెన్ కోటా రిజర్వేషన్ 80:20 పద్ధతిలో ఉండగా, తాజాగా 95:5 రేషియోను అమలుచేస్తారు.

అభ్యర్థుల స్థానికతను నిర్ధారించేందుకు గతంలో 4-10 తరగతుల చదువును పరిగణనలోకి తీసుకోగా, తాజాగా 1-7 తరగతులను లెక్కలోకి తీసుకుంటారు.

జీవో-3 ప్రకారం మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలుచేస్తారు. మూడు పోస్టులుంటే ఒక పోస్టును మహిళతో భర్తీ చేస్తారు.

01.07.2023 నాటికి 18- 46 సంవత్సరాల మధ్య ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 సంవత్సరాలు, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 3 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలపాటు వయోసడలింపు వర్తిస్తుంది.

# రైతులకు రుణవిముక్తి!

-మొదటిపేజీ తరువాయి

తీసుకున్న రుణాలను కూడా ముందుముందు మాఫీ చేస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రుణమాఫీ చేస్తున్నామన్నారు. కానీ కేసీఆర్ తన పదేళ్ల కాలంలో ఎన్నో హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల వివరాలను తాము సేకరించామన్నారు. నిధులు సేకరించి రైతులకు రుణవిముక్తి కల్పిస్తామని చెప్పరు. రైతు భరోసా పథకాన్ని కూడా పారదర్శకంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ సంఘాన్ని రూపొందించినట్లు చెప్పారు. జులై 15వ తేదీ నాటికి మంత్రివర్గం ఉపసంఘం నివేదికను ఇస్తుందని తెలిపారు. పరిపాలనకు సంబంధించి మంత్రులు శ్రీధర్ బాబు, తదితరులు ఎప్పుడైనా వివరాలు అందిస్తారన్నారు.

**కోతలయ్యాకే రైతుభరోసా**

రైతుభరోసాకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన అన్నదాతలను నిరాశ పరిచింది. ఈసారి కూడా పెట్టుబడి సాయం విత్తన దశలో కాకుండా, కోతల దశలో వస్తుందేమోననే చర్చ మొదలైంది. జూన్‌లోనే వానకాలం పెట్టుబడి సాయం పంపిణీని ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ, ప్రభుత్వం 'చర్చల' పేరుతో పెట్టిన మె లికతో సెప్టెంబర్ వరకు రైతుభరోసా అందే అవకాశం లేదని వ్యవసాయ, ఆర్థికరంగ నిపుణులు భావిస్తున్నారు. రైతుభరోసా మార్గదర్శకాలపై క్యాబినెట్ సబ్ కమిటీని నియమిస్తున్నామని, ఈ కమిటీ జూలై 15 నాటికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని సీఎం చెప్పారు. ఆ తర్వాత ఈ నివేదికను అసెంబ్లీలో చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు అంటే, అసెంబ్లీ సమావేశాలు పూర్తయి, ప్రభుత్వం నిర్ణ యం తీసుకునేలోగా జూలై నెల ముగుస్తుం ది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అధికారులు కొత్త నిబంధనలను రూపొందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అర్హుల జాబితాను రూపొందించాలి. వాటిని గ్రా మాలవారీగా ప్రదర్శించి, రైతుల నుంచి ఏ వైనా అభ్యంతరాలుంటే స్వీకరించి, మార్పులు చేయాల్సి ఉంటుంది.

**కౌలు రైతుల గుర్తింపు ఎలా?**

రైతుభరోసా కింద కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిని ఎలా గుర్తిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నా యి. కౌలు సమయంలో రైతుల నుంచి అ ఫిడవిట్లు తీసుకున్న కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ లెక్కన కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుంది. ఆ జాబితాపై అభ్యంతరాలు వ్యక్తమయ్యే క్రమంలో పరిష్కరించే బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉండనున్నది. చివరగా.. కొత్తగా అర్హుల జాబితా, కౌలు రైతుల జాబితాను క్రోడీకరించి, ఒకే భూమికి ఇద్దరికి పెట్టుబడి సాయం అందకుండా వడబోయాల్సి వస్తుంది. వీటికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు, చేర్పులు చేయాల్సి వస్తుంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం నెల నుంచి నెలన్నర సమయం పడుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ లెక్కన ఆగస్టులో కూడా రైతుభరోసా అందడం అసాధ్యమని స్పష్టంచేస్తున్నారు. సెప్టెంబర్‌లో పెట్టుబడి సాయం అందే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తాజా ప్రకటనతో ప్రభుత్వం వరుసగా రెండోసారి పెట్టుబడి సాయాన్ని ఆలస్యం చేయనునున్నట్టు స్పష్టమవుతున్నదని రైతులు వాపోతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9నే రైతుభరోసా నిధు లు వేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హడావుడి చేసిన సంగతి తెలిసిందే. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలస్యంగా పంపిణీని ప్రారంభించి, మే రెండో వారం వరకు కొనసాగించింది. ఈ దఫా కూడా ఇదే పరిస్థితి రానున్నది. ఇప్పటికే రైతులు అప్పులు తెచ్చి పంటలు వేస్తుండగా, పెట్టుబడి సాయం మాత్రం మరో రెండున్నర నెలల తర్వాత కోతలు ప్రారంభమయ్యే సమయంలో అందే అవకాశాలున్నాయని నిపుణులు చెప్తున్నారు.

# జయశంకర్‌కు నివాళులర్పించిన హరీష్ రావు





**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** తొలి మలి తెలంగాణ ఉద్యమ నేత, ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమకారులకు మార్గదర్శి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, వారి సోదరుడు మసూద్ రెడ్డి ఇళ్లలో ఈడి సోదరులు జరిపిన సందర్భంగా హరీష్ రావు, వారితో పాటు నాయకులు మసూద్ రెడ్డిని తన నివాసంలో కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులను భయపెట్టడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు కుట్రపూరితంగా బిఆర్ఎస్ నాయకుల ఇళ్లలో అక్రమంగా ఈడి సోదరులు నిర్వహింప చేస్తున్నారని అన్నారు. ఈడి సోదాలకు భయపడి వారితో కలిసిన నాయకులను మాత్రం వదిలిపెడుతున్నారని అన్నారు. అనుక్షణం ప్రజల మధ్యలో ఉండి ప్రజల కష్టాలు తెలుసుకున్న వ్యక్తి గూడెం మహిపాల్ రెడ్డి అని అన్నారు. రోజంతా సోదాలు జరిపిన ఈడి అధికారులకు ఏమీ దొరకలేదని అన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు తమ నాయకులు భయపడరని స్పష్టం చేశారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకునే లాగా దేశంలోనే ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్ కాపీ జరిగి విద్యార్థులు అంతా అయోమయంలో పడ్డారని, ఈ విషయమై దేశమంతా విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికి చీమ కుట్టినంత చింత లేకుండా నిమ్మకు నీరెత్తనట్లు ఈ విషయం పట్టించుకోవట్లేదు కానీ ప్రతిపక్ష నాయకులను మాత్రం ప్రత్యేక ఈడి సోదాలు జరిపించి ఇబ్బందులకు గురి చేయడానికి వారికి తగినంత సమయం ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, వంటేరు ప్రతాప్ రెడ్డి, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి
## మంత్రి దామోదర రాజా నరసింహ

**మంత్రితో కలిసి తెల్లాపూర్ మున్సిపల్ భవనం ప్రారంభోత్సవం**

**ప్రారంభోత్సవంలో పాల్గొన్న నీలం మధు, కాటా శ్రీనివాస్ గౌడ్**

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరైన తెల్లాపూర్ మున్సిపాలిటీ భవన ప్రారంభోత్సవం,గద్దర్ ఆడిటోరియం మరియు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, పటాన్చెరువు ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ పటాన్ చెరు ప్రాంత అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని వివరించారు. పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతుగా సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## శిశు మంధిర్ పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవం



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి అంటే యోగా చేయాలన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుంది అన్నారు. యోగ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు వేసిన యోగాసనాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆచార్యులు, కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన బైపాస్ బాధితులు

**నల్గొండ :** నల్లగొండ జిల్లా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ని నల్లగొండ బైపాస్ బాధి తులు కలిపారు. –బాధితులకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, సిపిఎం నేతలు మద్దతు పలికారు. మొదటి, రెండో ఆప్షన్ లను కాదని మూడో ఆప్షన్ ఎంచుకోవ డంతో.. 2వేల మంది బాధితులు ఇండ్లు, ప్లాట్లు కోల్పోతున్నారు. మంత్రి కోమటిరెడ్డి తక్షణమే స్పందించి మూడో ఆప్షన్ ను రద్దు చేయాలని కోరారు. వచ్చే 15 రోజుల సమస్యను పరిష్కరించి బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి. చేసారు. న్యాయం జరగకుంటే.. బాధితుల పక్షాన ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల హెచ్చరించారు.

## యోగ తోనే మానసిక ప్రశాంతత



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** నేటి సమాజంలో మనిషి జీవితంలో యోగ తప్పనిసరి అని యోగ గురువు హరి అన్నారు. శుక్రవారం యోగ దినోత్సవన్నీ పురస్కరించుకొని న్యూ లైఫ్ న్యూట్రిషన్ వర్ల్డ్, న్యూ లుక్ జిమ్ ఆధ్వర్యంలో యోగ డే ను కాలనీ వాసులతో జరుపుకున్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాంగా ఉండాలంటే యోగ తప్పనిసరని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుశీల, విజయ, అస్మా, తదితరులు పాల్గొన్నారు.





## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**ఆర్థిక సహాయం ఇప్పించిన**
**బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** బొల్లారం పారిశ్రామికవాడలోని స్నేహ లిఫ్ట్ పరిశ్రమలో కార్మికుడుగా పని చేస్తున్న తేజేశ్వరరావు ప్రమాదవశాత్తు మృతి చెందారు. పరిశ్రమ యాజమాన్యం బాధితులకు ఐదు లక్షల రూపాయలు నష్టపరిహారం ఇస్తానని చెప్పడంతో బాధితులు ఆనంద కృష్ణారెడ్డికి తెలపడంతో ఆయన పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి 21 లక్ష రూపాయలను నష్టపరిహారం ఇచ్చేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించింది. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. బతుకు తెరువు కోసం పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు తాను ఏ కష్టం వచ్చినా వారిని ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.

## పరిపాలన భవనాన్ని ప్రారంభించిన శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రూ.8 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మున్సిపల్ పరిపాలన భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన జాతీయ జెండా స్తంభం, మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించారు. రెండు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన గద్దర్ మల్టీపర్పస్ ఆడిటోరియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి, పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, నీళ్ల మధు ముదిరాజ్, మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లులు అందజేసిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

**మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ ను సంప్రదించండి**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** మొబైల్ ఫోన్ వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో కానీ సీఈఐఆర్ వెబ్ పోర్టల్ లో కానీ ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు గత మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న పదిమంది బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి తిరిగి జిల్లా ఎస్పీ అందజేశారు. మొత్తం 10 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లను బాధితులకు ఈరోజు అప్పగించడం జరిగింది అందుకున్న బాధితులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని నేరస్తులు దొంగలించిన మొబైల్ ఫోన్లను దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉంటూ వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి డిసిఆర్బి కే సురేందర్ రెడ్డి, సిఐలు ఫణిదర్, శ్రీనివాస్, సైబర్ సెల్ సిబ్బంది సంజీవ్ కుమార్, రియాజ్, స్టేషన్ సిబ్బంది శరత్, రాంప్రసాద్, ఇస్మాయిల్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న అమన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అర్బాత్ ఖాన్

వాస్తవ నేస్తం,ఆదిలాబాద్: అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి అమన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అర్బాత్ ఖాన్ మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గర్భిణీ స్త్రీ కి హిమోగ్లోబిన్ తక్కువ ఉండడంతో, అమన్ ఫౌండేషన్ సభ్యులకు సమాచారం అందించగా అర్బాత్ ఖాన్ రక్తదానం చేశారు. ఆయనతో పాటు వైస్ ప్రెసిడెంట్ పరమేశ్వర్ ఉన్నారు. అమన్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులను పలువురు ప్రశంసించారు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com